## ‘కొలాం’ల అభ్యున్నతికి కృషి

ఇంద్రవెల్లి, జనవరి 30 : కొలాం ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా అన్నారు. మంగళవారం లిమ్‌గూడ గ్రామాన్ని సందర్శించారు. జీవన స్థితిగతులపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరు తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద మౌలిక సదుపాయాలను కల్పిస్తామని పేర్కొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా

## అమరుల త్యాగం వెలకట్టలేనిది..

**- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ అర్బన్, జనవరి 30 : అమరవీరుల త్యాగాలు వెలకట్ట లేనివని, వారి త్యాగఫలమే నేటి మన స్వాతంత్ర్యం అని ఎస్పీ జానకి షర్మిల ఉద్ఘాటించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడి హృదయంలో స్వదేశీ, స్వభాష, స్వరాజ్ అనే స్ఫూర్తిని గాంధీ నింపారని పేర్కొన్నారు. దేశం కోసం వేలాది మంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. అలాంటి త్యాగధనులను స్మరించుకోవడం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, డీపీవో సూపరింటెండెంట్ నర్సమ్మ, ఆర్ఐ రాంనిరంజన్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్పీ, సిబ్బంది

## కంది కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

నార్నూర్, జనవరి 30 : కంది కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలోని ఉప మార్కెట్ కార్యాలయంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. డీఎం ప్రవీణ్ మాట్లాడుతూ.. తేమ 12 శాతం మించవద్దని.. పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. మొదటి రోజు క్వింటాలుకు రూ.9,772లు పలికింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, మేనేజర్ సావిత, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, ఐటీడీఏ డైరెక్టర్ మడావి మాన్కు పటేల్, సీఈవో ఆడే గణేశ్, నాగోరావ్ పాల్గొన్నారు.



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ తీస్తున్న అధికారులు, విద్యార్థులు

# జరభద్రం

**అట్టహాసంగా కొనసాగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలు**

- మొదలైన కార్యక్రమాలు.. వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహణ..
- నిర్మల్ జిల్లావ్యాప్తంగా గత ఐదేండ్లలో 1,259 రహదారి ప్రమాదాలు
- వాహనదారుల ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు

నిర్మల్ అర్బన్, జనవరి 30 : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నిర్మల్ జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఈనెల 17వ తేదీన ప్రారంభం కాగా.. వచ్చే నెల 14 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు వాహనదారులకు అవగాహన సదస్సులను నిర్వహించనున్నారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా, ముథోల్ ప్రాంతాల్లోని డ్రైవర్స్‌కు నిబంధనలు, ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నారు. గత ఐదేళ్లలో 1,259 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 571 మంది మృతి చెందగా.. 1,313 మంది గాయపడ్డారు. గత శనివారం విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వాహనాల డీలర్లు స్థానిక ఎన్‌టీఆర్ మినీ స్టేడియం నుంచి ర్యాలీ నిర్వహించారు.

### వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి..

**- జయ్ కుమార్, డీటీవో, నిర్మల్.**

- నిర్మల్ జిల్లా రవాణ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి. రోడ్డు భద్రతపై వాహనదారులకు ఫిబ్రవరి 14వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను చేపడుతాం. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు పాటు పడాలి.

**గత ఐదేళ్ల లో రోడ్డు ప్రమాద ఘటనలు..**

| సంవత్సరం | ప్రమాదాలు | మృతి చెందిన వారు | గాయాలైన వారు |
|---|---|---|---|
| 2019 | 277 | 91 | 236 |
| 2020 | 231 | 108 | 219 |
| 2021 | 277 | 140 | 377 |
| 2022 | 260 | 139 | 279 |
| 2023 | 214 | 93 | 202 |

### వాహనదారులు పాటించాల్సిన నిబంధనలు..

- డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇవ్వరాదు. ఇస్తే వాహన యజమానికి రూ.1000 జరిమానా లేదా సెక్షన్ 180 ప్రకారం మూడు నెలల జైలు శిక్ష.
- వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. లేకుంటే రూ.500 జరిమానా, సెక్షన్ 181 ప్రకారం మూడు నెలల జైలు శిక్ష. ● పోలీసు ఉత్తర్వులు పాటించని వారికి, సమాచారం ఇచ్చేందుకు నిరాకరించిన వారికి సెక్షన్ 179 ప్రకారం రూ.500 జరిమానా. ● వాహనానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. లేకుండా నడిపితే వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. సెక్షన్ 192 ప్రకారం రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు జరిమానా.
- బీమా లేకుండా వాహనం నడిపితే చట్టరీత్యానేరం. అలా నడిపిన వారికి సెక్షన్ 196 ప్రకారం రూ.1000 జరిమానా, మూడు నెలల జైలు లేదా రెండు శిక్షలు విధించవచ్చు. ● మద్యం తాగి వాహనం నడపడం క్షమించరాని నేరం. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడితే అరెస్టు చేస్తారు. సెక్షన్ 185 ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తారు. ● సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం చట్టరీత్యానేరం. అలా వాహనం నడిపితే సెక్షన్ 184 ప్రకారం రూ.1000 జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష. ప్రమాదకర డ్రైవింగ్, జంపింగ్ సిగ్నల్స్ చేస్తే రూ.1000 జరిమానా. ● ద్విచక్రవాహనం నడిపేవారు హెల్మెట్ ధరించకుంటే సెక్షన్ 177 ప్రకారం రూ.100 జరిమానా. ● ద్విచక్రవాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తే సెక్షన్ 128,177,184 ప్రకారం రూ.500 జరిమానా. ● వాహనాలను రోడ్లపై నిలిపితే 122 సెక్షన్ ప్రకారం రూ.200 అపరాధ రుసుం వసూలు చేస్తారు. ● ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే.. సెక్షన్ 32(111) 177 ప్రకారం డ్రైవర్‌కు రూ.2 వేల అపరాధ రుసుం, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు.● డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణించరాదు. అలా చేస్తే సెక్షన్ 125 ప్రకారం డ్రైవర్‌కు రూ.100 జరిమానా విధిస్తారు. ● గూడ్స్ వాహనాల్లో ప్రయాణిస్తే సెక్షన్ 252 ప్రకారం వాహన డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు.● గూడ్స్ వాహనాల్లో పరిమితికి మించి సరుకులు రవాణా చేస్తే సెక్షన్ 194 ప్రకారం రూ.3 వేలు జరిమానా. ● వాహనదారులు సీటు బెల్టు ధరించకుంటే సెక్షన్ 138(3) ప్రకారం రూ.100 జరిమానా. ● ఉద్దేశపూర్వకంగా ట్రాఫిక్ సిగ్నల్స్, డివైడర్స్ బోర్డులను చెరిపేసినా, గోడ పత్రాలు అతికించినా సెక్షన్ 119 ప్రకారం రూ.200 అపరాధం వసూలు చేస్తారు.
- వాహన నంబర్ ప్లేటు పై నంబర్ తప్ప ఎలాంటి రాతలు ఉండకూడదు. నంబరు ప్లేటుపై ఫ్యాన్సీ నంబర్లు ఉంటే సెక్షన్ 177 ప్రకారం రూ.100 జరిమానా వేస్తారు.

## సీఎంఆర్ బియ్యాన్ని అందించాలి..

**- నిర్మల్ జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీకళ**

నిర్మల్ టౌన్, జనవరి 30 : నిర్మల్ జిల్లాలోని పౌర సరఫరాల శాఖ ద్వారా రైస్‌మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ బియ్యం సేకరణ గడువు బుధవారంతో ముగియనుండగా..ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాలని ఆ శాఖ డీఎం శ్రీకళ తెలిపారు. నిర్మల్ జిల్లాలో 60 మంది రైస్ మిల్లర్స్ ఉండగా.. ఇప్పటికే 15 మంది రైస్‌మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. 2022-23 ఖరీఫ్‌కు సంబంధించిన 1,12,160 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 79,524 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందగా.. మిగతా 33,441 మెట్రిక్ టన్నుల బియ్యం అందాల్సి ఉందని తెలిపారు. రబీకి సంబంధించిన 1,58,656 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 1,06,831 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా కావాల్సి ఉందని తెలిపారు. ఈ గడువు ఉన్నందున పాత సీఎంఆర్ బియ్యాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఎంఆర్ బియ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల 15 రోజుల్లోనే 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించడం జరిగిందన్నారు. మిగిలిన బియ్యాన్ని కూడా రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు.



త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

## ఆర్జీయూకేటీలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

బాసర, జనవరి 30 : బాసర ఆర్జీయూకేటీలో మంగళవారం ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి 177వ వర్ధంతి సందర్భంగా ఆరాధనోత్సవాలను నిర్వహించినట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, బాలకృష్ణ, సురేశ్, శివకుమార్, వీణ, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే భరోసా

**● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ ● షాదీముబారక్ చెక్కుల పంపిణీ**

నేరడిగొండ, జనవరి 30 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు భరోసా ఉండేదని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పథకాలు తప్పకుండా వస్తాయనే నమ్మకం ఉండేదని తెలిపారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతున్నా.. రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు అమలు కాకపోవడంపై మండిపడ్డారు. సాధ్యమైన హామీలనే బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, సర్పంచ్‌లు జంగు, జాదవ్ రమేశ్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ నాగోరావ్, నాయకులు పాల్గొన్నారు.



షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

## అమరుల త్యాగాలు చిరస్మరణీయం

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, జనవరి 30 : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ముందుగా గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, కార్యాలయంలో ఏవో భక్తప్రహ్లాద్, ఆర్ఐ సీఐలు నవీన్, మురళి, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, సీసీ దుర్గం శ్రీనివాస్, ఫింగర్ ప్రింట్ నిపుణులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎస్పీకి సన్మానం

ఎస్పీని మహార్ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు భీంరావు కాంబ్లే, మహిళా అధ్యక్షురాలు సవితాబాయిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. వారి వెంట ప్రధాన కార్యదర్శి భీంరావు, రామారావు పాటిల్, యశ్వంత్‌రావు పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, సిబ్బంది



పెర్సపేన్ పూజలకు వెళ్తున్న ఆదివాసీ గోండు గిరిజనులు

## గిరి గ్రామాల్లో పెర్సపేన్ పూజలు

బోథ్, జనవరి 30 : మామిడి గూడలో ఆదివాసీ గోండు గిరిజనులు మంగళవారం పెర్సపేన్ పూజలు నిర్వహించారు. యేటా పుష్య మాసంలో మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పూజలు నాలుగు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో భీంరావ్, జైతు మహారాజ్, జన్ను బాపు, లాలురం, కాశీ పటేల్, పురుషోత్తం పాల్గొన్నారు.



నర్సాపూర్ నుంచి దోడందకు గంగాజలంతో వెళ్తున్న మెస్రం వంశీయులు

## దోడందకు మెస్రం వంశీయులు

**గ్రామ పొలిమేరల్లోని ఓ చెట్టుపై గంగాజలం**

ఇంద్రవెల్లి, జనవరి 30 : హస్తలమడుగులో సేకరించిన గంగాజలంతో మెస్రం వంశీయులు దోడందకు చేరుకున్నారు. ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్ పొలిమేరలో మంగళవారం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని దోడందకు బయలు దేరారు. గ్రామస్తులతోపాటు మెస్రం వంశీయులు ఝరికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పొలిమేరలోని ఓ చెట్టుపై అల్లుడితో గంగాజలం ఝరిని భద్రపర్చారు. మెస్రం వంశీయులు గంగాజలంతో ఈనెల 30 నుంచి 4వ తేదీ వరకు దోడందలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు కటోడ మెస్రం కోసు, పర్ధాంజీ మెస్రం దాదారావ్, కటోడ కోసేరావ్, నాయిక్‌వాడి మెస్రం ధర్ము, పెన్‌కొత్వాల్ మెస్రం తిరుపతి తెలిపారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి..

**పెంబిలో రాష్ట్ర కమిషనరేట్ బృందం పర్యటన**

పెంబి, జనవరి 30 : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర కమిషనరేట్ ఏసీడీపీవో ప్రతాప్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర కమిషనరేట్ బృందం సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థుల వయస్సు ప్రకారం ఎత్తు, బరువు వివరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఉమేశ్, సీడీపీవో సరిత, సూపర్‌వైజర్‌లు నిర్మల, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల ఎత్తును పరిశీలిస్తున్న అధికారులు

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఎదులాపురం, జనవరి 30 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సరఫరా అవుతున్న గుడ్లు, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐసీడీఎస్ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు.



కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

## సమస్యల పరిష్కారానికే సమ్మె నోటీసు

నిర్మల్ టౌన్, జనవరి 30 : మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వేతనాలను పెంచాలని కోరుతూ ఫిబ్రవరి 16వ తేదీన సమ్మె నిర్వహిస్తున్నామని ఆ సంఘం నాయకులు మంగళవారం డీఈవో రవీందర్‌రెడ్డికి నోటీసు అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని కోరారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

### అంగన్‌వాడీల సమావేశం

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి, ఐసీడీఎస్ కేంద్రాలకు బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు పోశెట్టి అన్నారు. మంగళవారం నిర్మల్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ సమ్మెను 16న నిర్వహిస్తున్నామని, ఇందులో భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శైలజ, తులసి, రాజమణి, అరుణ పాల్గొన్నారు.

### సమ్మెను జయప్రదం చేయండి..

కార్మికుల డిమాండ్ల సాధన కోసం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి విలాస్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లో ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ, అశోక్ పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ వర్ధంతి

ఎదులాపురం, జనవరి 30 : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులకు స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం నివాళులర్పించింది. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి చాంబర్‌లో సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే ధృడ సంకల్పంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఈడీఎం రవికుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు రాంరెడ్డి, నలంద ప్రియా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అశోక్, నవీన్, అధికారులు ఉన్నారు.



మౌనం పాటిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి